# సురసాగరమథనం

— వి.ఆర్. రాసాని

నిజమే!

ఎవరో అన్నట్లు మనిషిని కుక్క కరవడం మామూలు విషయం అయితే మనిషి కుక్కను కరవడం అసాధారణ విషయం.

ఒక స్త్రీ... అందునా - కొత్త పెళ్లికూతురు... మొదటి రాత్రే చనిపోతే అది మామూలు విషయమా?

మరి అది సంచలనమే కదా!

మనుషులు ఎన్నో రకాలుగా చస్తుంటారు. ఆ చావుల్లో కొన్ని సాధారణాలు, మరి కొన్ని అసాధారణాలు.

ఆమె చావు కూడా అలాంటిదే!

ఉత్పలకు పెళ్లై ఒక్క రోజు కూడా గడవలేదు.

ఆమె మొదటి రాత్రే... పెనిమిటితో బాటు... మృత్యువూ ఆ గదిలోకి అడుగు పెడుతుందని ఎవరికి తెలుసు?

ఆమె తొలి రాత్రి ఇంకా తెల్లవారనే లేదు. కానీ ఆమె బతుకు మాత్రం అప్పుడే తెల్లవారిపోయింది.

పొద్దు పుట్టేలోపల ఆమె మరణ వార్త... క్షణాలమీద ఆ వీధిలో అందరికీ తెలిసిపోయింది.

ఆబాలగోపాలం అక్కడ గుమిగూడిపోయారు.

తల నిండా పూలు, కళ్లనిండా కాటుక... ముద్దులొలికే ముఖంమీద... చంద్రునిలో మచ్చలా చిన్న తిలకం... కాళ్లకు పారాణి... మల్లెతీగెను అలంకరించినట్లున్న ఉత్పల శరీరం... ఆమె తొలి రాత్రికోసం... ఆ గదిలో ఏర్పాటు చేసిన మంచంపైనే అచేతనంగా పడి ఉంది. దొండపండ్ల లాంటి ఆమె అందమైన పెదాలమీదుగా... సీసాల కొద్దీ నెయిల్ పాలిష్ వొలికిపోయినట్టు... ఆమె హృదయాన్ని చీల్చుకుని వెలుపలికి వచ్చిన రక్తం... అప్పుడే తడారిపోయి ఈగలు ముసురుతున్నాయి.

అందరి హృదయాలు దుఃఖంతోనూ, శ్మశాన వైరాగ్యంతోనూ బరువెక్కుతున్నాయి.

ఆ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి గుండెను శోకం వడ్రంగివాని ఉలిలా తొలిచేస్తోంది.

ఆమె మంచాని కలంకరించిన మల్లెమాలల్లో అప్పటికే వాడిపోయి ఉన్న మల్లెలు ఒక్కొక్కటే రాలిపోతూ... అక్కడ చేరిన వారి కళ్ల కొలకుల్లోనుండి రాలిపడే అశ్రుబిందువుల్ని తలపింపచేస్తున్నాయి.

ఆ మంచాని కానుకొని ఒకవైపు ఆమె తండ్రి... నలభై అయిదేళ్ల నరసిమ్ములు లబోదిబోమని రోదిస్తున్నాడు. మరోవైపు... ఆ ముందునాడే ఆమెకు భర్తగా మారిన రాఘవులూ అక్కడే నిలబడి పెల్లుబికి వస్తున్న కన్నీటిని... భుజాన ఉన్న కొత్త తుండుగుడ్డతో తుడుచుకుంటున్నాడు.

అందరికీ వెనక... మరో త్రయంబకంలా నిర్వికారంగా కళ్లు నీటిని స్రవిస్తుంటే పదహారేళ్ల సుబ్బరమణి మౌనంగా నిలబడి... అవ్వ పక్కనుంచీ... అక్క శవాన్ని చూస్తున్నాడు.

అక్కడ చేరిన అమ్మలక్కలు శోకిస్తూనే... రకరకాలుగా చెవులు కొరుక్కుంటున్నారు.

"అయ్యో! బంగారట్ల బిడ్డమ్మ... వొగ అన్నెమెరుగునా వొగ పున్నెమెరుగునా...? అప్పుడే నూరేండ్లు నిండిపోయినాయే తల్లీ!"

"అది కాదేయమ్మా! ఆ బిడ్డకు ముందే కాన్సరో ఏందో వున్నిందంట్లే... అందుకే నెత్తురు కక్కోని సచ్చిపోయింది."

"అదేం కాదక్కా? ఆ పెండ్లికొడుకు మా చెడ్డోడంట. వోడే ఏదో సేసేసుంటాడు... ఆ..."

"ఏమ్మాట! వోళ్ల అయ్యే ఏదో జేసుంటాడు. వోడేం సామాన్నిడా... వోడి బాద బరించలేకనే గదా వోళ్లమ్మ ఈ రోదిలి యెళ్లిపోయిండేదీ!"

ఇలా ఎవరికి తోచిన విధంగా వారు చెప్పుకుంటున్నారు. ఎవ రేమనుకున్నా ఉత్పల మరణానికి ఒక విధంగా ఆమె తండ్రే కారణం.

** ** **

సరిగ్గా ఇప్పటికి ఇరవై ఏండ్ల ముందు మాట.

అప్పటికి నరసిమ్ములికి పాతికే ళ్లుండచ్చు.

ఏదో ఒక ప్రయివేటు కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆ ఊర్లోనే కమల అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.

కమల ఎంత అందగత్తో దానికి మించిన మంచి గుణం కలది. అందుకే ఏరి కోరి ఆమెనే పెళ్లి చేసుకున్నాడు నరసిమ్ములు. నరసిమ్ములకి వెనుకా ముందూ ఎవ్వరూ లేరు ఒక్క తల్లి తప్ప.

పెళ్లి కాగానే నరసిమ్ములు తల్లిని, భార్యను తీసుకుని పట్నం వచ్చి అద్దింట్లో కాపురం పెట్టాడు.

వారి సంసారం సజావుగానే సాగిపోతోంది. వారి పెళ్లైన రెండేండ్లకే వారి కుటుంబంలోకి చిరుదీపంలా ఉత్పల పుట్టుకొచ్చింది. తల్లి పోలికనే గాక ఆమె గుణాలను పుణికిపుచ్చుకుని బంగారు బొమ్మలా ఉండేది ఉత్పల. మరి అయిదేండ్లకు సుబ్బరమణి పుట్టాడు. అదేమి చిత్రమో గానీ వాడి పుట్టుకతో బాటు ఆ కుటుంబానికి కొన్ని కష్టాలూ కొత్తగా పుట్టుకొచ్చాయి.

హాయిగా ఉద్యోగం చేసుకుంటూ బాగా సంపాదిస్తున్న నరసిమ్ములుకు అనుకోకుండా తాగు డలవాటైంది. అలవాటైందే తడవుగా... అనతి కాలంలోనే దానికి బానిసైపోయాడు. అవడమే కాదు ప్రతి రోజూ తాగొచ్చి కమలను, పిల్లల్ని చితకబాదేవాడు. వచ్చి బూతులు తిట్టేవాడు. నరసిమ్ములు ఆగడాలను కమల మౌనంగా భరించేది. కానీ... అత్త మాత్రం కొడుకునే సమర్థించేది. కొడు కిలా తయారవడానికి తనే కారణమని నోటి కొచ్చినంత మాటా అనేది. పైగా సాధించేది కూడాను.

ఇలా నరసిమ్ములు ప్రతిరోజూ డ్యూటీ దిగడం, తాగేసొచ్చి భార్యా పిల్లల్ని చితకతన్నడం వారి జీవితంలో ఒక భాగంగా తయారైపోయింది.

వచ్చిందాంతో భర్త తాగేసొస్తుంటే పిల్లల్ని పస్తు లుంచలేని కమల ఆ వీధిలోనే నాలుగిళ్ళలో పాచిపని చేస్తూ సంసారాన్ని నెట్టుకొచ్చేది.

ఆమె ఇంటి కెదురుగా చాలా కాలం నుంచి వెంకటేశు అనే ఒక ధోబీ లాండ్రీ పెట్టుకుని గుడ్డలు తోముకుంటూ ఉండేవాడు. నరసిమ్ములు అఘాయిత్యాన్ని రోజూ అతను గమనిస్తూ ఉండేవాడు. భర్త ఏమన్నా నోరు మెదపని కమలని చూస్తే అతని కెక్కడలేని జాలీ, దయ.

'పాపం ఆ మహాతల్లి ఎలా భరిస్తోందో' అనుకునేవాడు.

ఇలా ఉండగా ఒక రోజు ఒక సంఘటన జరిగింది.

రోజూలాగే ఆ రోజు కూడా పీకలదాకా తాగొచ్చి నట్టింట్లో నేలపైన అలాగే కూలబడ్డాడు నరసిమ్ములు.

ఆ సమయంలో పొరబాటున ఉత్పల స్కూల్లో కట్టాల్సిన ఫీజు గురించి అడిగింది కమల.

అంతే! అంతవరకూ దున్నపోతులా నిద్రపోతున్నట్లున్న నరసిమ్ములు ఆ మాటతో తోక తొక్కిన త్రాచులా పైకి లేచాడు.

"ఒసే! నువ్వు సంపాదించిందంతా ఏమైందే? నీ యబ్బడాలా!" వచ్చి బూతులు తిట్టసాగాడు. పిల్లలు భయంతో ఒక మూలకు ఒదిగిపోయారు. ఇంకెంత రాద్ధాంతం చేస్తాడోనని భయపడుతూనే.

"నే నేమన్నా నయ్యా! అంత మాట్లంటావ్? ఇంట్ని సూసుకోవాల్సిన మొగోడివి. బిడ్డె సదువు గురించి ఎత్తతానే అట్లా లేస్తావ్?" అంది కమల.

"అ దేం సదిగి రాజ్యమేలాల్నా? మల్లా ఎదురు మాట్లాడతావా? మొగుడంటే లెక్కలేదే."

అతని నోటికి అడ్డే లేకపోయింది.

తల్లి చెప్పినా వినిపించుకోలేదు నరసిమ్ములు. ఈ సారి కమల ఊరుకోలేదు. మాటకు మాట సమాధాన మిచ్చింది. దాంతో పేట్రేగిపోయిన నరసిమ్ములు తలుపు సందు నున్న దుడ్డు కర్ర తీసుకుని కమల వీపు విమానం మోత మోగిస్తున్నాడు. అడ్డొచ్చిన పిల్లలకీ రెండు వడ్డించాడు.

కమల లుంగ చుట్టుకుపోతోంది.

ఈ ఘోరమంత చూస్తున్న వెంకటేశు మనసు మాత్రం ద్రవించిపోయింది. వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్ళి అతని చేతిలో దుడ్డు కర్ర లాక్కున్నాడు.

"ఏందయ్యా యిది? దేవతలాంటి ఇల్లాల్ని

కొట్టే సంపత ఉండావు? నువ్వు మడిసివా? పిశాచివా?''

దండింపుగా అన్నాడు వెంకటేశు.

అలా కాస్త అడ్డుకుంటే ఆ ఇల్లాలికి ఆ దెబ్బలు తప్పిపోయి ఆ రభస ఆగిపోతుం దనుకున్నా డతను. కానీ అదే అతను చేసిన తప్పు. ఆ ప్రయత్నమే ఆ ఇల్లాలికి శాపంలా తయారైంది.

"నీ నీ యబ్బడాలా! ఆడికీ, నీకూ ఏంటే సంబంధం? నీ మీద ఎంత ప్రేమ లేకపోతే దెబ్బ పడతానే వరుగెత్తుకుంటా వస్తాడే? ఎన్నిరోజు ల్నుంచీ సాగుతోందే?''

వినరాని బూతులు తిడుతూ మళ్ళీ రెండు దెబ్బలు వేశాడు. ఆ మాటతో అవాక్కైపోయిన వెంకటేశు 'ఛీ' అనుకుంటూ లాండ్రీ కొచ్చి ఆ ఇల్లాలి బాధను తలచుకుని బాధపడుతూ, బట్టలు తోముకుంటూ ఉండిపోయాడు.

అప్పటి నుంచి నరసిమ్ములకు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే భార్యను కొట్టడానికీ, తిట్టడానికీ సరికొత్త-స్లోగన్ అలవాటైపోయింది.

తాగేసొచ్చి నప్పుడల్లా "ఒసే "అన్ని మరుక్కుని నా కన్నాయం సేస్తావే ..'' అని కేకలు వేస్తూ గలాటా చేసేవాడు. అది మామూలే కనుక ఆ వీధిలో వారిని గురించి ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ వెంకటేశు మాత్రం కాస్త మనసున్నవాడు గనుక చాలా బాధపడిపోయేవాడు. అందుకే తాగిన నరసిమ్ములు ఏమన్నా పట్టించుకోకుండా, కమలను కొట్టినప్పుడల్లా అడ్డుపడుతూ ఉంటాడు. అది ఆ నరసిమ్ములుకీ, అతని తల్లికీ కంటగింపుగా ఉండేది.

కమల పరిస్థితి రాను రాను దారుణంగా తయారైంది. ఒకవైపు మొగుడి బాధ, మరోవైపు అత్త పోరు.

అత్త మాటిమాటికీ "ఆడికీ నీకూ ఏంటే సంబంధం? వాడితోనే పోగూడ దంటే? వసే బసివిదానా, యాభిశారిదానా'' అని నానా మాటలూ అంటూ కొడుక్కు తందాన పాట పాడుతుంటుంది.

అదేవిధంగా మొగుడూ అంటూ ఉంటాడు.

ఉత్పల తల్లిపైన జాలి చూపించడం తప్ప, ఏమీ చేయలేకపోయేది. అయినా ఆ చిన్నారి తల్లిని ఓదారుస్తూనే ఉండేది.

ఎంత ఓర్చుకున్నా కమల పరిస్థితిలోగానీ, ఆమె భర్త, అత్తల ప్రవర్తనలోగానీ మార్పు రాలేదు. పైపెచ్చు కొట్టడం ఇంకా ఎక్కువైపోయింది. పైగా వెంకటేశుకు, తనకు సంబంధం అంటగట్టి వీధంతా ప్రచారం చేసేశారు.

ఆ నరకాన్ని భరించడం కమల వల్ల కాలేదు. రాను రాను ఆమె పరిస్థితి దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షులా తయారైంది. అందుకే ఒక్కొక్కసారి ఆ ఇల్లే వదిలి దూరంగా వెళ్ళిపోవడమో, లేదా చనిపోవడమో చేయాలనుకుంది కమల. కానీ పిల్లల మొఖం చూసి ఆ సాహసం చేయలేకపోతోంది.

నరసిమ్ములుకి వెంకటేశుపైన అనుమానం పెనుభూతంలా తయారైంది. ఒకరోజు పుండుపైన కారం చల్లినట్లు మరో దారుణం జరిగిపోయింది.

ఆ సాయంత్రం డ్యూటీ దిగిన నరసిమ్ములు రోజులాగే పీకలదాకా తాగి, ఇంటికి వచ్చాడు. అప్పుడు సమయం రాత్రి పది గంటలు. కానీ ఆ సమయంలో కమల ఇంట్లో లేకపోవడంతో చిర్రెత్తింది. అనుమానం అతని హృదయాన్ని కుమ్మరిపురుగులా తొలిచేస్తుంటే గడప ముందుకొచ్చి ఎదురుగా ఉన్న లాండ్రీ వైపు చూశాడు.

అంతే! అతని హృదయం భగ్గున మండిపోయింది.

కమల వెంకటేశుతో మాట్లాడుతోంది.

పొద్దున ఇస్త్రీ కేసిన పిల్లల బట్టల్ని తిరిగి తీసుకురావడానికే అక్కడికి వెళ్ళింది కమల.

ఆ విషయం తెలియని నరసిమ్ములు అశ్లీలంగా తిడుతూ ఎగబడ్డాడు.

"వసే! పదిగంటల రాత్రి కాడ వోడితో మాట్లాడత కులకత ఉండావే? వేన్తో లేసిపోతవా ఏందీ?''

అడ్డూ అదుపూ లేకుండా అరుస్తున్నాడు. వీథిలో అందరూ చూస్తున్నారు. ఆ మాటలు వినలేక గబగబా ఇంట్లోకి వెళ్ళబోయింది కమల. అయితే నరసిమ్ములు ఇంట్లోకి రానీయలేదు.

"వసే తిరుగుబోదా! వాడితోనే లేసిపో. నా ఇంట్లోకి రావద్దు. పో! పోయే!'' అంటూ గుమ్మాని కడ్డుపడ్డాడు.

అయినా కమల అతన్ని లెక్కచేయలేదు. తోసుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.


ఎమ్మాటాడితే ఇంకేం రాద్ధాంతం చేస్తాడో నని, ఆ సంసారాన్ని కూల్చే తన లాండ్రీ ఇక ఇక్కడ అవసరం లేదనుకుంటూ మౌనంగా చూస్తూ ఉండిపోయాడు వెంకటేశు.

ఆ మరునాడు పాచిపనులు చేయడానికి వెళ్ళిన కమల మళ్ళీ వెంకటేశును కలుసుకుంది.

"అయ్యా! వెంకటేశూ! యట్లైనా ఈ నరకం నుంచి నన్ను రచ్చించే ఉపాయం సెప్పయ్యా! సచ్చి నీ కడుపున పుడతాను'' అతి దీనంగా అడిగింది.

అందులో ఏ అర్థం తోచిందో అతనికి, జాలితో ఆమెను చూస్తూ రెండు కన్నీటి బొట్లు వదిలాడు.

అతని మంచితనానికీ, సున్నిత మనస్తత్వానికీ




కమల మనసు కరిగిపోయింది.

ఆ మరునాడు ఉదయానే అన్ని పనులూ చేసేసింది కమల. ఏ డయ్యేసరికి స్నానం చేసింది. బిడ్డలకీ స్నానం చేయించింది.

ఆప్యాయంగా ఉత్పల తలకు నూనె పట్టించి, జడ వేసింది. జడ వేస్తున్నంతసేపూ ఆమె కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి. అత్త నోరు బూతులు తిడుతూనే ఉంది.

"వసే బసివీ! ఇంకా ఎంతసేపే సోకులు. తొందరగా దాన్ని బడికి పంపించు. తక్కువ కులం వోడితో కులికే నీకు సోకులుగానీ, దాని కెందుకు?''

ఆ మాటలు కమల హృదయాన్ని చిద్రాలు చేస్తూనే ఉన్నాయి. కమల మౌనంగా భరిస్తూ కూతుర్ని పదే పదే ముద్దు పెట్టుకుంది.

"నా బంగారు తల్లీ! బాగా చదువుకో, మంచిగా నడుచుకో తల్లీ!'' అంటూ ఒడిలోకి తీసుకుని బోరున ఏడ్చింది. ఇలా తల్లి ప్రవర్తనలో ఏదో కొత్తదనం తోచేసరికి కాస్త చలించింది ఉత్పల.

ఉత్పల కనుమరుగైపోయేంత వరకూ గుమ్మంలోనుంచి చూస్తూనే ఉండిపోయింది కమల.

ఇక సుబ్బరమణిని పిల్చి తన చేతులారా అన్నం తినిపించింది.

"తిను నాన్నా! తిన్రా! కడుపునిండా తిన్రా. నా బంగారు కొండ, నా చిట్టి తండ్రీ తిను'' అంటూ ముద్దులతో ముద్దలు కలిపి తినిపించింది.

ఆ తర్వాత పాచి పనులు చేయడానికి బయలుదేరి వెళ్ళింది.

అంతే! అలా వెళ్ళిన కమల తిరిగి రానేలేదు.

కొందరు నరసిమ్ములు బాధ పడలేక ఏ రైలు కిందో పడి చనిపోయిం దనుకున్నారు.

ఆ వెంకటేశుతోనే లేచిపోయి ఉంటుందని మరి కొంద రనుకున్నారు.

సరిగ్గా ఆ దినం నుంచే వెంకటేశు కనిపించకపోవడమే దానికి కారణం కావచ్చు.

ఇలా కొన్ని ఏళ్ళు గడి చాయి. కానీ కమల తిరిగి రానేలేదు.

అమ్మ వెళ్ళిపోవడంతో ఉత్పల చదువుకు స్వస్తి చెప్పి ఇంటి పరిస్థితుల్ని చూస్తూ వచ్చింది.

ఇంతలో కాలం గిర్రున కొన్ని సంవత్సరాల్ని దాటుకుని వెళ్ళింది. ఆమెకు పెళ్ళీడు వచ్చింది. సుబ్బరమణి మాత్రం ఇంటర్‌లో చేరాడు.

ఇన్ని మార్పులొచ్చినా, నరసిమ్ముల్లో మాత్రం మార్పు రాలేదు. కానీ ఎంత తాగుబోతైనా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రెండో పెళ్ళి చేసుకోలేదు. అయితే అతని తాగు డలవాటు గానీ, కమలపైన ద్వేషంగానీ అవగింజంతైనా తగ్గలేదు.

అతని తల్లిలోనూ అంతే!

పైగా కమల వ్యభిచారి అనీ, ఆమె వెంకటేశుతో లేచిపోయిందని తమందరికీ మోసం చేసిందని పదే పదే పిల్లలకి చెబుతూ, కమలంటే ఒక విధమైన ద్వేషం వారి హృదయాల్లో పెరిగేందుకు ఆ తల్లీ కొడుకులు ప్రయత్నం చేశారు.

సుబ్బరమణికి వారి మాటలు బాగా

ఒంటబట్టాయి. తల్లి మా బెత్తితెనే అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు. అయితే ఉత్పల హృదయంలో మాత్రం తల్లి అలా చేయడానికి కారణం తండ్రీ, అవ్వల ప్రవర్తనలే కారణ మనే అభిప్రాయం పాతుకుపోయింది. అందుకే ఉత్పల ఇప్పటికీ తల్లిని తల్లిగానే చూస్తుంది.

పెళ్ళికి ఎదిగిన కూతురికి సంబంధాలు తేవడానికి నరసిమ్ములు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. కానీ కమల విషయం, నరసిమ్ములు విషయం తెలుసుకున్న ఏ ఒక్కరూ ఉత్పలను చేసుకుంటా నని ముందుకు రాలేదు.

చివరికి తను ఉద్యోగం చేసే లారీలో పనిచేస్తున్న రాఘవులు అనే కుర్రాడ్ని ఎలాగో ఒప్పించి పెళ్ళి నిర్ణయం చేశాడు నరసిమ్ములు.

పెళ్ళికి అన్ని ఏర్పాట్లు సాగుతున్నాయి. పెళ్ళి ఇక రెండ్రోజులే.

ఉత్పలకు మాత్రం మనసు మనసులో లేదు. పోయే చివరి వరకు తమ కోసమే అన్నట్లు తండ్రి హింసల్ని అవమానాల్ని భరించిన తల్లి లేని లోటు లోటుగానే తోచింది ఉత్పలకు. అందుకే ఎలాగో రహస్యంగా తల్లి అడ్రస్ సంపాదించింది. అక్కడికి ఒక్క రోజులో పోయి రావచ్చు. పెళ్ళి తెల్లవారితే ఒక్కరోజే.

ఏం చేయాలో ఉత్పలకు అర్థం కాలేదు.

తీవ్రంగా ఆలోచిస్తే చివరికి ఒక ఆలోచన తట్టింది. వెంటనే తమ్ముణ్ణి పిలిచి చెప్పింది.

"వరే అబ్బా! నీకు అమ్మ అడ్రస్ ఇస్తాను. పొయ్యి కనీసం పెళ్ళి పత్రికన్నా ఇచ్చి, అడిగినట్లు చెప్పి రారా! అమ్మ కనీసం సంతోషిస్తుంది."

ఆ మాటతో సుబ్బరమణికి కోపం వచ్చింది. అక్కపైన ఎగిరిపడ్డాడు. "అక్కా! నీ కేమైనా తెలివి ఉందా? ఎప్పుడో మనల్ని వదిలేసిపోయిన ఆ చెడ్డదాని సంగ తిప్పు డెందుకు?" ఆవేశంగా అన్నాడు.

"వరే సుబ్బరమణీ!" కోపంతో ఊగిపోతూ గట్టిగా అరిచింది ఉత్పల.

ఆ కేకతో కొంచెం ఆవేశం తగ్గించుకున్నాడు సుబ్బరమణి.

"నీ కేం తెలుసురా? అమ్మంటే చెడ్డది కాదురా, దేవతరా! అవ్వ, అయ్యా చెప్పే దంత తప్పేరా." వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ చెప్పింది.

"మంచిదైతే ఎంకటేశుతో ఎందుకుపోయింది?"

"నువ్వప్పుడు చానా చిన్నోడివి. నీకు తెలీదు! నాయన దినాము తాగేసొచ్చి నానా తిట్లూ అనీ, కొట్టీ, ఈ కంట్లో నీళ్ళు ఆ కంట్లో తీసినాడ్రా! కడాకు అయ్యో మన్నె ఎంకటేశుతో అక్రమ సంబంధం అంటగట్నారు. అమ్మ ఉన్నన్ని దినాలు అవ్వేకపక్క, నాయ నొక పక్క కాకుల్లాగా పొడుచుకు తిన్నార్రా! అందుకే చేయని తప్పుకు నింద మోసిన అమ్మ - తప్పు సేసినా వగటే, నింద మోసినా వగటే నని వెళ్ళిపోయిందిరా!"

ఉప్పొంగి వస్తున్న కళ్ళ నీళ్ళని తుడుచుకుంటూ తిరిగి చెప్పింది ఉత్పల.

"ఇప్పుడు చెప్పరా! ఇది అమ్మ చేసిన తప్పా? అయ్యా, అవ్వా చేసిన తప్పా? చెప్పరా!"

అక్క అలా అడిగేసరికి ఏం సమాధానం చెప్పాలో తెలియని సుబ్బరమణి మౌనంగా ఉండిపోయాడు.

కానీ, అతని మనసులో తల్లిపై ఉన్న భావాన్ని మాత్రం చెరిపేసుకోలేకపోయాడు. అయితే అక్క మీద ప్రేమ కొద్దీ, ఆమె సంతృప్తి కోసం ఆమె చెప్పినట్లే చేయా లనుకున్నాడు. అడ్రస్సు, పెళ్ళి పత్రిక చేతి ఖర్చుకు డబ్బులు తీసుకుని బయలుదేరాడు సుబ్బరమణి.

ప్రయాణం చేస్తున్నంత సేపూ తల్లి ఎలా ఉంటుందో చూడా లనుకున్నా, మనసులో మాత్రం ఆమె చెడ్డ మనిషి, పతిత అనే భావాన్ని మాత్రం పెంచుకున్నాడు.

ఎట్టకేలకు ఎలాగొలా అడ్రస్ కనుక్కొని, అటువైపుకు నడిచాడు బస్సు దిగిన సుబ్బరమణి.

అవి పట్నం చివర ఉన్న పూరి గుడిసెలు. అలాగని మరీ కూటికి లేని వాళ్ళ గుడిసెల్లా కనిపించడం లేదు. వాటి మధ్యలో అక్కడక్కడా ఓ మోస్తరు మిద్దెలు కూడా ఉన్నాయి.

ఒక మోస్తరు ఆర్థిక స్తోమత ఉన్న డ్రైవర్లు, కూలీలు వంటి వారు స్వయంగా కట్టుకున్న ఇళ్ళు అవి. అందర్నీ అడుక్కుంటూ అడ్రస్‌లో ఉన్న గుడిసె దగ్గరకు వెళ్ళాడు సుబ్బరమణి.

అది ఒక అడ్డకొట్టం. ముందర చిన్న పందిరి ఉంది. కొట్టమైనా చూడ్డానికి ముచ్చటగా, శుభ్రంగా ఉంది.

సరాసరి లోపలికి వెళ్ళకుండా, ఆ పందిట్లోకి వెళ్ళి తటపటాయిస్తూ, ఎప్పుడో తమని వదిలేసి వచ్చిన తల్లిని కలుసుకుంటున్నందుకు మనసులోనే నొచ్చుకుంటూ, గుమ్మం వైపు చూశాడు.

తలుపు వారగా వేసి ఉంది.

లోపల ఎవరో బోకులు తోముతున్న శబ్దం!

క్షణం ఆగి, "లోపల ఎవరూ?" అంటూ తలుపు తట్టాడు.

ఆ మరుక్షణం తలుపు తెరుచుకుని వచ్చిన ముప్పైయైదేళ్ళ స్త్రీని చూసి క్షణం సేపు నివ్వెరపోయాడు.

సౌమ్య గంభీరంగా, ఎంతో అందంగా ఇంకా కొంతసేపు చూడా లనిపించేటంత ఆకర్షణీయంగా ... ఆమె అతన్నే చూస్తోంది.

ఆమె ముఖంలో ఏదో మాటల కందని గంభీరభావం! ఆమెను చూడగానే సుబ్బరమణి హృదయంలోనూ ఏదో సంచలనం.

"ఎవరు బాబూ నువ్వు? ఏం కావాలి?"

చేతికున్న తేమను పైటకు తుడుచుకుంటూ పలకరించిం దామె. ఆ పలుకు తేనె సొనలకన్నా తియ్యగా అనిపించింది అతనికి. కాస్త తేరుకున్న సుబ్బరమణి - "నేను పులిచెర్ల నుంచి వచ్చినా, మా అక్క పంపించింది" అన్నాడు.

పులిచెర్ల మాట వినగానే ఆమె కళ్ళు ఆనందంతోనూ, ఆతృతతోనూ మెరిసిపోయాయి.

అంతలోనే ఏదో బాధ. కాస్త విషాదఛాయ ఆమె మొఖంలో ఒక్క క్షణం మెరిసి, అంతర్థానమైపోయింది. అయినా దాని తాలూకు చిహ్నాలు అలాగే మొఖంపైన కనిపిస్తూనే ఉన్నాయి.

"పులిచెర్లలో ఎవుర్నాయనా నువ్వు? మీ యక్క ఎవరు?" ఆతృతను అణుచుకుంటూ అడిగింది.

"నేను డ్రైవర్ నరసిమ్ములు కొడుకును, నా పేరు సుబ్బరమణ్యాం. మా అక్క పేరు ఉత్పల."

ఆ మాట వినగానే ఆనందంతో ఆమె కళ్ళు అశ్రుపూరిత లయ్యాయి.

"అయ్యో నాయనా! నువ్వా! రా నాయనా రా!"

లోపలికి తీసుకెళ్ళి గోడకు ఆన్చి ఉన్న వైరు మంచం తీసి, వేసి "కూర్చో నాయనా!" అంటూ ఎంతో ఆప్యాయంగా కూర్చోబెట్టింది.

ఆప్యాయతతో కూడిన ఆమె మాటలు అతనికి జున్ను కన్నా కమ్మగా, అమృత తుల్యాలుగా అనిపిస్తున్నాయి.


"మీ యక్క బాగుందా నాయనా?" ఆశగా అడిగింది.

"ఆఁ బాగుంది."

"మీ నాయన సక్రమంగా ఉండాడా?" తటపటాయిస్తూ అడిగింది.

"ఆఁ" ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

ఆమె మొఖాన్ని శరీరాన్ని చూస్తూ, ఆమెలో





కనిపిస్తున్న ఉత్పల పోలికల్ని తన పోలికల్ని గమనిస్తున్నాడు సుబ్బరమణి.

'అక్క చెప్పింది నిజమే ననిపిస్తా ఉంద. ఇంత మంచి అమ్మను బాధ పెట్టేదానికి నాయన కెట్లా చేతు లొచ్చినాయో? ఇంత వయసొచ్చినా ఎంత బాగుండాది, అంధుకే గదా అక్క బాధ పడేది.' వరి వరి విధాలా ఆలోచించసాగాడు.

అతని మనసులో అంతవరకూ ఆమెపై ఉన్న ఊహలు, అభిప్రాయాలూ, అన్నీ మెల్లగా మంచులా కరిగి దూరమవుతూ వస్తున్నాయి.

ఇంతలో పుస్తకాల సంచీ భుజాన వేసుకుని ఓ పన్నెండేళ్ళ అందమైన కుర్రాడు "అమ్మా!" అంటూ పరుగెత్తుకుంటూవచ్చాడు. వచ్చీ రాగానే సుబ్బరమణి ముఖం చూసి బిడియపడుతూ ఆమె కాళ్ళకు చుట్టుకుపోయి వెనుక నుంచి

చిన్నగా "ఎవరమ్మా?" అన్నాడు.

ఆమె నవ్వుతూ "మీ అన్న నాయనా!" అంది.

"ఈడి కొచ్చిన మూడేండ్లకు పుట్నాడు. పేరు వీర వెంకట నరసిమ్మం" అని సుబ్బరమణికి పరిచయం చేసింది.

తన వైపే వింతగా చూస్తున్న అతనివైపే చూస్తూ, "తన తండ్రినీ, వెంకటేశునీ సమ దృష్టిలో చూస్తున్న దనడానికి ని. దర్శనంగా కొడుక్కు వీరవెంకట నరసిమ్మం' అని పేరు పెట్టుకుంది కాబోలు" అనుకున్నాడు.

ఆ ఊహ రాగానే ఆమె గొప్పతనాన్ని మనసులోనే మెచ్చుకున్నాడు.

"ఇంతకీ ఏమి నాయనా ను వ్వొచ్చిండి?" ప్రశ్నించింది.

"మా అక్కకు పెండ్లమ్మా! పత్రిక పంపించింది" పత్రిక అందిస్తూ అన్నాడు.

అంతవరకూ ఆమె పైన ఉన్న అనుమానాలన్నీ పటాపంచలైపోగా 'అమ్మా' అని పిలవా లనుకుని అప్రయత్నంగానే "అమ్మా!" అనేశాడు.

తల్లి ఎంత చెడ్డదైనా, కష్టంలోనూ, ఆనందంలోనూ 'అమ్మా!' అని ఉచ్చరించని మనిషి ఉండడు కదా!

ఆ పత్రికను తీసుకున్న కమల ఆనందంతో దాన్ని తన హృదయాని కేసి హత్తుకుంది.

"నా చిట్టి తల్లీ! మిమ్మల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి వచ్చినా, ఈ దుర దృష్టవంతురాలిని ఇంకా గుర్తుపెట్టుకున్నావా నా బంగారు తల్లీ!" అంటూ కళ్ళ నీళ్ళతో పదే పదే దాన్ని ముద్దు పెట్టుకుంది.

"మీ బావ ఏం చేస్తాడంట నాయనా?"

"మా నాయన పని జేసే దాంట్లోనే క్లీనరు.

ఆ మాట వినగానే ఆమె ముఖంలో అంతవరకూ కనిపించిన ఆనందం కాస్తా నీరు కారిపోయింది.

'నత్తలన్నీ ఒడ్డుకే చేరినట్టు, అతనూ తాగుబోతు కాదు గదా?' క్షణం సేపు ఆలోచించి 'ఏమైనా నేను చేయగలిగిం దేమీ లేదు గదా! దాని తలరాత ఎట్లుంటే అట్లవుతుంది' అని తనని తాను సమాధానపరచుకుంది.

"ఇం కొస్తానమ్మా!"

సుబ్బరమణి పైకి లేవబోయాడు.

"ఒక్క క్షణం ఉండు బాబూ!" అని ముందు గదిలోకి వెళ్ళి తాను ఈ కుటుంబం కోసం చేసిపెట్టుకున్న అత్తిరసాలు, మరికొన్ని పిండివంటలు మూటగట్టి, ఆ మూటను ఒక చేతి సంచిలో పెట్టి తీసుకుచ్చి - "అత్తిరసాలంటే మీ అక్కకు ఇష్టం నాయనా! తీసుకుపోయి ఇయ్యి" అంటూ ఇచ్చింది.

అతన్ని అక్కున చేర్చుకుని ముద్దాడుతూ "నాన్నా! మహారాజులా ఉన్న నిన్ను మహారాణిలా ఉన్న మీ అక్కను వదిలేసి వచ్చిన ఈ కర్మురాల్ని చమించమని మీ యక్కతో చెప్పు నాయనా!"

"బాబూ! కన్నా! ఇక్కడ నాకు ఏ యిబ్బందీ లేదని చెప్పు నాన్నా!" కళ్ళ నీళ్ళు ధారగా కారుతుంటే ముద్దుల్లో ముంచేసింది కమల. ఆమె హృదయంలోని ఆవేదన కట్టలు తెంచుకుంది.

"నా చిట్టి తండ్రీ! ఆయనలాగా ఈయన తాగడు, తిట్టడు, కొట్టడు. బాగా సంపాదిస్తాడు. టవున్లో నాలుగు తావల లాండ్రీలు పెట్నాడు. నాకే లోటూ రానీడు. ఈ ఇల్లు సొంతమే నాయనా."

ఆమె మంచితనానికి, అంతవరకూ దూరమైన ఆమె మాతృ ప్రేమకూ సుబ్బరమణి హృదయం కరిగిపోయింది.

ఆమె చెప్పుకుపోతుంటే తాను తెలుగు క్లాసులో చదువుకున్న హనుమ త్సందేశంలో సీతాదేవి గుర్తుకొస్తోంది అతనికి.

"అమ్మా! ఇంత మంచిదానివి మమ్మ ల్నెందుకమ్మా వదిలేసి వచ్చేసినావు?" ఏడుస్తూ అడిగాడు.

"మీ అమ్మ ఎప్పుడో నచ్చిపోయింది నాయనా! ఈ కట్టె మాత్రమే మిగిలింది. నాలో ఉండే మీ అమ్మను మీ నాయనా, మీ యవ్వా ఎప్పుడే సంపేసినారు నాయనా! నా దురదృష్టాన్ని చూసి ఈయన ఆదరించినాడు. శానా మంచోడు. మీరంటే కూడా ఎంతో ఇది" మనసును కాస్త కుదుటపరచుకుని చెప్పింది.

"నరేనమ్మా! నేను వచ్చినట్టు తెలిస్తే నాయన చంపేస్తాడు. బిన్నే పోవాల. వస్తానమ్మా!"

సెలవు తీసుకుని తిరిగి తిరిగి చూసుకుంటూ వచ్చేశాడు సుబ్బరమణి.

అతను 'అమ్మా!' అంటూ ఉంటే జీవితాంతం, ప్రాణం పోయేంతవరకూ, ఆఖరి శ్వాసవరకూ అలాగే పిలిపించుకోవా లనే ఆమెలో ఆరాటం.

అంతలోనే ఆమె హృదయంలో ఆ అదృష్టానికి నోచుకోని దుస్థితికి పెల్లుబికే శోకం!

"నా బిడ్డ చక్రవర్తిలాగా ఉండాడు. నా తల్లి బంగారు తీగె మాదిరుండేది. ఇప్పు డెట్టుందో .. ఇంక ఈ జన్మలో నా బిడ్డల్లు చూస్తావో లేదో ..." అనుకుంటూ కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ, అలాగే నిలబడి గుమ్మలో నుంచే అతన్ని చూస్తుండిపోయింది కమల.

ఇదంతా అర్థం కాని ఆమె చిన్న కొడుకు ఆమెనే చూస్తున్నాడు బిక్కమోహం వేసుకుని.

** ** **


తమ్ముడి రాక కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్న ఉత్పల తమ్ముడిని తల్లి దగ్గరకు పంపించిన విషయం ఎక్కడ తండ్రికి తెలిసిపోతుందో నని భయపడిపోతోంది.

అక్కడికి ఒకటికి రెండు సార్లు అడిగాడు కూడా. 'స్నేహితులకు చెప్పి రావడానికి వెళ్ళా'డని చెప్పింది.

పొద్దుపోతోంది. అయినా సుబ్బరమణి ఇంకా రాలేదు. ఆమె మనసు ఆందోళన పడుతోంది.

'వీడు అడ్రస్ కనుక్కున్నాడో లేదో? ఒకవేళ కనుక్కునా అమ్మ ఉందో, లేదో, ఉంటే ఏమనిందో' అలా తీవ్రంగా ఆలోచిస్తున్న సమయంలోనే దిగాలుగా వచ్చాడు సుబ్బరమణి.

అతని వాలకం చూసిన ఉత్పల ఏం జరిగిందో నని - "అబ్బా! ఏం జరిగిందిరా? అమ్మ ఉన్నిందా? బాగుందారా? ఏ మనింది? సుఖంగానే ఉండాదా? నిన్ను బాగా చూసిందా?" ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించింది అతని చేతిలోని సంచిని,



ఇతడే రాజా విక్రమసింహ తన పాత 'వాన్ గార్డ్' కారుకు పెట్రోలు పోయించడానికి జేబులు తడుముకునే విక్రమసింహకు, ఒకసారి ఫైవ్ స్టార్ హోటల్‌లో బిల్లు చెల్లించే గండం ఎదురయ్యింది. అతడు ఆ గండం నుంచి ఎలా బయటపడ్డాడో త్వరలో ప్రారంభమయ్యే

**ప్రేమాయ నమః**

సీరియల్‌లో చదవండి.

ఇకపోతే-

చేతిలో పైసా లేని మాజీ రాజా విక్రమసింహులుంగారితో వియ్యమందుకునే నిర్ణయం తీసుకున్న మిలియనీర్ బాలసింగంగారు.

ఆయన మిమ్మల్ని వచ్చే వారం పలకరిస్తారు.

చూస్తు.

"అక్కా! అమ్మ పోయినప్పుడు నేను చిన్నోన్ని. బుద్ధి తెలీదు. బుద్ధి తెలిసిన నువ్వు ఆ దినం స్కూలుకు పోకుండా ఉండాల్సింది. అమ్మ మన్తోనే ఉండేది" కళ్ళనీళ్ళు కక్కుకుంటూ కమల పంపించిన పిండి వంటల నంచీ అందించాడు.

ఆ మాట అనేసరికి ఉత్పల కళ్ళూ చెమర్చాయి.

** ** **

ఉత్పల పెళ్ళి వైభవంగా కాకపోయినా బాగానే జరిగింది. ఎంత తాగుబోతైనా, ఆమె తొలి రాత్రి కూడా ఆ స్థాయిలోనే జరిపించాడు నరసిమ్ములు.

ప్రతి స్త్రీ కలలు గన్నట్లే ఉత్పలకు తొలి రాత్రి వచ్చింది. ప్రతి స్త్రీ జీవితంలో మరిచిపోలేని ఆ రాత్రి రెండు మనసులతోబాటు, రెండు శరీరాలు ఏకమై వారి కొత్త జీవితానికి పునాదులు వరిచే ఆ రాత్రి ...

ఆ రాత్రి కోసమే ఎదురు చూస్తోంది ఉత్పల. మధ్య గదిలో ఒక వైపునకు మంచం, దానికి దోమ తెరలుగా వేలాడదీసిన మల్లెపూల మాలలు. పక్కనే ఒక స్టూలు పైన పళ్ళు, పాలు, మత్తెక్కించే అగరొత్తుల వాసన. నిరీక్షించే కొద్దీ ఉత్పల మనసు తేలిపోతోంది.

అమ్మ పంపిన పిండివంటలు పక్కనే పెట్టుకుంది. అమ్మ దీవెనలతో పునీతమైన ఆ వంటల్ని తను, రాఘవులు పంచుకుని తిని, ఆ తర్వాత అతనితో శరీరాన్ని పంచుకోవాలనుకుంది.

తండ్రిలా తన భర్తా తాగుబోతు కాకూడదనీ, అలా అయితే తల్లిలా తనూ నరకాన్ని అనుభవించాల్సి వస్తుందనీ, తుదకు ఆ ఊహనే భరించలేకుండా ఉంది ఉత్పల.

పడక గదిలో ఎలా మెలగాలో చెప్పిన నాయనమ్మ మాటలు ఆమె చెవిలో గింగురుమంటూనే ఉన్నాయి.

రాఘవులు నిశ్చితార్థం రోజున తొడిగిన పచ్చరాతి ఉంగరాన్ని మనసారా మురిపెంగా ఒక్కసారి చూసుకుని, అతని రాక కోసం ఎదురు చూస్తోంది ఉత్పల.

తొమ్మిది గంటలకే వస్తా ననుకున్న రాఘవులు ఏ పదకొండుకో గానీ రాలేదు. వచ్చినా మామూలుగా రాలేదు. పీకలదాకా మందుకొట్టి మరీ వచ్చాడు.

ఉత్పల హృదయం బద్దలైంది.

తను ఏది జరగకూడ దనుకుందో అదే జరిగింది.

"ఎలుక ఎలుక బొక్కలోనే చేరుతుంది. దొంగ దొంగతోనే చేరుతాడు. తండ్రీ అంతే!

తలుచుకునే కొద్దీ ఉత్పలలో వైరాగ్యం చోటు చేసుకుంటోంది.

"ఏయ్! ఉత్పలా! ఇట్ట రాయే నీ .."

వచ్చీ రాగానే మంచం పైన కూలబడుతూ అరిచాడు.

ప్రతి కన్య తన మొదటి రాత్రి భర్త ప్రేమతో అనే మాటల్నే వినాలని, ఆ మాటల్ని జీవితాంతం గుండెలో దాచుకోవాలని ఆశిస్తుంది. కానీ ఉత్పల అక్కడ బూతులు వినాల్సివచ్చింది.

తల వంచుకుని ప్యాగ్గానుతో సిగ్గుపడుతూ భర్త చెంతకు వెళ్ళాల్సిన ఉత్పల భయంతో వణికిపోతూ వెళ్ళాల్సి వచ్చింది.

హృదయాన్ని బిగబట్టుకుని తన్నుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ దగ్గరకు వెళ్ళింది.

"కూసోయే ...".

లాగి పక్కన కూర్చోపెట్టుకుని ఆమెతో ప్రణయం లేకుండానే గట్టిగా కౌగిలించుకున్నాడు.

అతని కౌగిలి ఆమెకు ముళ్ళ పొదలా అనిపించింది.

సారా వాసన ముక్కుపుటాల్ని ఛేదిస్తుంటే "తొలి రాత్రే తాగి రావడం సంసార లక్షణమేనా?" అతని కౌగిలి విడిపించుకుంటూ అంది. అంతకు మించి ఏమనాలో తెలియని ఉత్పల.

దాంతో రాయిదెబ్బతిన్న పిచ్చికుక్కలా కయ్‌మని పైకి లేచాడు రాఘవులు.

"నీ యవ్వ .. నువ్వు పెద్ద సంసారి వంటనే! యభిశారి ముండా! మీ వంగిశమే పెద్ద యభిశార్ల వంగిశమే! మీ యయ్య తాగుబోతు నాకొడుకు. మీ యమ్మ తుపు ఇం కెవరూ దొరకనట్లు ఎంకటేశాన్ని ఎత్తకపోయిన యభిశారి లం... నాకు నీతులు సెప్పతావే నీ యవ్వ .."

పచ్చి బూతులు తిట్టి, తిరిగి అన్నాడు - "మీ అయ్య ఏదీ తాగించి, కాళ్ళా ఏళ్ళా బడి బతిమాలుకుంటే సరే నన్నా. పెండ్లి జేసుకున్నా. అంతే అంతే!"

దాంతో కనీసం తనపైన ప్రేమ కూడా లేని ఈ తాగుబోతుతో ఎలా కాపురం చేయాలి? అయ్యో సాలు అల్లుడి కొచ్చిందో? అనుకుంటూ నిర్వీణ్ణురాలైంది ఉత్పల.

ఇక ఆ రాత్రి రాఘవులు పశువులా ఆమెను అనుభవించి ఏమీ పట్టనట్టు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

"ఆనాడు దేవదానవులు క్షీరసాగరాన్ని మధిస్తే అమృతం పుట్టింది. ఈనాడు తన తండ్రి సురసాగరాన్ని మధిస్తే హాలాహలంలాంటి శోకం పుట్టింది.

ఆ హాలాహలాన్ని శివుడు మింగి భరించాడు.

ఈ హాలాహలాన్ని అమ్మ మింగి, దాన్ని ఇక్కడ హరాయించుకోలేక పలాయనం చిత్తగించింది. భర్తకు తగిన గుణపాఠం నేర్పింది. తన కలాంటి ధైర్యం కూడా లేకపోయింది - అనుకుంది ఉత్పల.

** ** **

అంతే!

తెల్లవారేసరికి అందరి ముఖాలు తెల్లబోయే విధంగా, శవంగా మారిపోయింది.

ఆమె చేతిలోని రాయిలేని ఉంగరం వెక్కిరిస్తూ కనిపిస్తోంది.

శివుడు హాలాహలాన్ని అమృతంలా మింగేస్తే, ఉంగరపు రాయినే హాలాహలంగా చేసుకుంది ఉత్పల.

శవం రూపంలో డప్పుల శబ్దాల మధ్య, ఏడుపుల మధ్య శ్మశానం వైపు ఉత్పల ప్రయాణం చేస్తుంటే, ఆఖరుసారిగా ఆమెను చూసి, తను అంతకు ముందు రోజు పోయి వచ్చిన అడ్రస్‌నే చేతబట్టుకుని ఆ ఊరినీ, ఆ మనుషుల్నీ వదిలేసి దూరంగా వెళ్ళిపోతూ పయనిస్తున్న బాటసారిలా కనిపించాడు సుబ్బరామణి.

★

